"తమ ప్రభుత బ్రహ్మయువైతే-
తమ ఘనత కృతయుగముదైతే-"

# తొలగిపోతున్న చీకట్లు

తోట వెంకటాద్రి

శుభ్రిని ధవళవస్త్ర ధారిణులై, రోగుల్ని ఉద్ధరించడానికి, ఆకాశన్నుంచి కిందికి దిగి వచ్చిన దేవకన్యల్లా మెరుస్తూన్న నర్సుల్ని చూచినప్పుడు కలిగే ఆ కొద్దిపాటి నేత్రానందం తప్ప, సీసాల ఛణాఛణలూ, మందుల వాసనలూ, రోగుల మూలుగులూ - అంతా చూస్తే ఆసుపత్రి మరో ప్రపంచంలా గోచరించింది. అహర్నిశలూ, అమిత శ్రద్ధాసక్తుల్తో, కించిత్తు విసుగు లేకుండా, రోగుల సేవచేసే ఆనర్సుల జీవితాలు ధన్యాతి ధన్యాలనిపించింది. యెటువంటి త్యాగశీలురకు గూడా వారు తీసిపోరు అని నాలో నేను అనుకుంటున్న సమయంలో, చిరునవ్వులు చిమ్ముకుంటూ, ట్రే పట్టుకుని నర్సు నామంచం దగ్గరకు రానే వచ్చింది.

"యీ వేళటి పత్రికుంటే తెచ్చిపెడుదురూ, యేమీ తోచడంలా" అన్నాను వచ్చిన నర్సును చూచి.

"మీరు చదవగూడదు, మాట్లాడగూడదు, ఆలోచించ గూడదూ, మంచంమీదినుంచి కదల, మెదల కూడదు" అంటూ ఆమె కచ్చితంగా జవాబిచ్చింది నే నడిగిన దానికి.

"ఇంతటి నిర్బంధమా! పోలీసు చర్యానంతరము గూడా సంస్థానంలో నాజీల పాలనా?" అని ఆశ్చర్య మభినయిస్తూ ఓ ఛలోక్తి విసిరాను. దానికా ఆంగ్లో-ఇండియన్ యువతి నవ్వుకుంటూ, "మీ జబ్బటువంటిది. పొద్దున డాక్టరు చెబుతుండగా వినలా?" అంటూ ట్రే లోని ధర్మామీటర్ని నా నోటి దగ్గరకు తెచ్చింది.

"సరే క్షమించండి! శ్రమ యిస్తున్నానని మరోలాగు భావించక, యీ వేళటి వార్తలేమయినా ఉంటే చెప్పండి" అని నర్సును ప్రాధేయపూర్వకంగా అడిగాను.

"మీ రెప్పుడూ ఇంతే" నంటూ ధర్మామీటరు నా నోట్లో పెట్టి, "ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని తెలియరావడం మూలాన, వచ్చే నెలనుండి నవాబుగారు మసీదుకు వెళ్లుతున్నప్పుడు, రోడ్లను నిర్మానుష్యం చేయనక్కరలేదనీ ప్రజలు తమతమ విధులు యథేచ్ఛగా నిర్వర్తించుకో వచ్చనీ, స్వయంగా నవాబుగారే ప్రకటించారు. యింతే, యింకేం లేవు" అని నా టెంపరేచరు వగైరా చూచి, యింకో రోగి దగ్గరకు వెళ్లింది నర్సు.

నర్సు చెప్పినవార్త నాచెవుల్లో గింగురుమని మోగసాగింది. అవును, నవాబుగారు మసీదుకు పోతున్నప్పుడూ, అక్కడినుంచి మళ్లీ యింటికొచ్చేటప్పుడూ, పొద్దునా సాయంత్రం రోజుకు నాలుగుసార్లు, ఆయన కారు యే ఆటంకం లేకుండా యెకాయెకి పోవడానికి రోడ్డంతా ఖాళీ చేయబడేది. ఇంకో అర్ధగంటకు ఆయన బయలుదేరుతాడనంగానే, కింగ్ కోఠీ దగ్గరనుంచి, పత్థర్ ఘట్టీలోని మక్కా మసీదు వరకూ, పోలీసుల ఈలలు భూనభోంతరాళం విజృంభించేవి. జనం అంతా చావు బ్రతుకుల మీద ఒకళ్ల మీద ఒకళ్లు పడుకుంటూ, ఒక్కుమ్మడి రోడ్డుకిరుపక్కలకూ వత్తుకు నేవాళ్లు. కార్లూ, సైకిళ్లూ, బండ్లూ, రిక్షాలూ ఎక్కడివక్కడ గబుక్కునఆగిపోయేవి. శత్రువిమానం గానీ, శత్రునౌక గానీ, చూపుకు తగిలినప్పుడు, ప్రయాణంచేస్తున్న యుద్ధనౌకలో "యాక్షన్ బెల్" మోగితే యెంత హడావుడిగా ఉంటుందో, అంతకు వేయింతలు గగ్గోలుగా ఉండేది హైదరాబాదు నగరంలో, నవాబుగారు ప్రార్థనకయి మసీదుకు బయల్వెడలే ముందు. ఇక ఆ తొందరలో సందట్లో సడే

మియో అన్నట్లు జేబుదొంగల వలన జులుబు వదిలినవారూ, రైలందదేమో నని దిగులుపడే వారూ, ఆఫీసు టైము అయిపోతుందని ఆతురత నొందేవారూ, పనిబాటలు యింకా పూర్తిగాక విచారించేవారూ—ఒకటేమిటి! అనూం బాపతుకు జెందిన వారంతా, ఆ సమయంలో నిరుత్సాహులై, కంటగించుకుంటూ, చేసేదిలేక, నవాబుగారి కారు దాటిపోయిందాకా, చచ్చినట్లు అట్లాగే నిలబడేవారు. ఎంత ప్రాణం మీదికొచ్చిన పనున్నా, పోలీసులు రోడ్డు దాటడానికి నిరాకరించి, పైపెచ్చు అడిగిన వారికి మంగళహారతులు గూడా యిచ్చేవారు. అథవా యెవరైనా, అప్పుడు మూర్ఖంచేసి రోడ్డు దాటాడా, యిహ వాడి గతి వేరే చెప్పనవసరం లేదు. ఏదో నెలకోసారన్నా అయితే దాంధుంపతెగలే అనుకోవచ్చు. ప్రతిరోజూ అందులోనూ రోజుకు నాలుగు సార్లయ్యే యీ మిడిమేళం. యెంత నవాబయినా చూశారూ! యిహ ఆ సమయంలో; ఎక్కడచూసినా "యీ పీడ యెప్పుడు విరగడ అవుతుందిరా?" అనే వారూ, "యెహె! ఇదేదో ఏలిన్నాటి శనిరా" అనేవారూ, "ప్రపంచంలోకల్లా భాగ్యవంతుడు గదా నవాబుగారు, యింట్లోనే ఒక మసీదు, ఒక గోరీల దొడ్డి, కట్టించుకో గూడదూ మనల్నిట్లా చంపకపోతే" అనేవారూ, "యిది యింకా ఢిల్లీ వర్గాలకు తెలిసిందో లేదో" అనే వారూ, "చూస్తాం, చూస్తాం యెన్నిరోజులో యీ నాటకం" అనేవారూ. వీరిలో ముస్లింలు కూడా లేకపోలేదు. వీరందరి దీవనలమధ్య నవాబుగారి కారు మహావేగంలో పోయివస్తూ ఉంటుంది.

ఒకానొకసారి ఒక గర్భిణీ స్త్రీ ప్రసవించడానికి కారులో ఆసుపత్రికి పోతూఉందట. ప్రమాదవశాత్తూ నవాబుగారు మసీదుకు బయలుదేరడం ఆ సమయంలోనే జరిగింది. యెంత కాళ్లా, వేళ్లాబడ్డా, స్వామిభక్తి పరాయణులైన పోలీసులు తమ సేవా ధర్మాన్ని మరిచిపోలేదు. యెంతో ఒక్క క్షణం పడుతుంది కారు రోడ్డు దాటడానికి. అంత ఆ స్త్రీకి నొప్పు లెక్కువై బజార్లో కారులోనే ప్రసవించిందట. యిదో చిన్న సంఘటన లెండి. యిలాంటివి ఆ సమయంలో యెన్నెన్నో జరుగుతూ ఉండడం పరిపాటే. అని నాలో నేను అనుకొంటున్న సమయంలో, గుండె జబ్బుని ఆసుపత్రిలో జేరిన స్టేటుబ్యాంకి గుమాస్తా పొద్దుబోక నా దగ్గరకొచ్చి కూర్చొని, 'చూశారూ! ఆహా! యెంతవాడి కెంత గతి పట్టిందండీ!' అన్నాడు.

"యేమిటేమిటి?" అంటూ ఆ గుమాస్తాను ప్రశ్నించాను. నర్సు చెప్పిన వార్తను మళ్ళీ ఆయన యేకరువుబెట్టి, 'చూశారూ! అంతటి నవాబుగారు బజారున పోతూవుంటే సామాన్య ప్రజలు పక్కపక్కన మసలుతూండడం, ఆయన మహా ఘనతకు లోటు కాదుటండీ! ప్రజాశ్రేయస్సు దృష్ట్యా, తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాన్ని మానుకుంటున్నాడు. నిజంగా ఆయనది చాలా ఉదార హృదయం. లేకపోతే యీసోషలిస్టులసత్యాగ్రహం ఓ లెక్కటండీ ఆయనకు! యెవరో ఆయనమీద సుప్రీంకోర్టులో దావావేస్తే ఓ పట్టింపా? యెవరు వీరంతా? ఆయన ఉఫ్ అంటే ఊకమాదిరి లేచిపోరూ?' అంటున్న గుమాస్తాతో, 'అవును అవును' అని మధ్యన నేననాల్సి వచ్చింది.

'చూశారూ! నవాబుగారు ఉర్దూ, పార్సీ, అరబ్బీ భాషల్లో మహాపాండిత్యం సంపాదించిన మేధావి. గొప్ప కవి. చార్మినారు సిగరెట్లు దప్ప యింకో రకం కాల్చని, అతి నిరాడంబరజీవి. యుగంధర, చాణక్యుదుల్నిగూడా మించిన రాజకీయవేత్త. అందుకనే, రాజగోపాలాచార్యులు అసఫ్‌జాహీ వంశజులంతా ప్రజాసేవకులని, అందు ఉస్మానలీఖానులు ప్రజాసేవలో గడిదేరినవారనీ, ప్రశంసించి పోయారు. అందుకనే, మన నాయకులు ఆయన్ను రాజప్రముఖుణ్ణిచేసి గౌరవించారు. విన్నారూ! మన ఆంధ్ర మేధావులు చాలామంది నవాబుగారి ఛత్రచ్ఛాయలకింద నే, మహాంధ్రదేశం యేర్పడాలని సూచించారు గూడాను. ఆయన అంతస్తుకూ మన అంతస్తుకూ చూసుకుంటే,...'అంటూ బ్యాంకి గుమాస్తా గణగణ యింకా యేదో చెప్పబోతున్న సమయంలో, నా తలవైపు మంచంమీద పండుకొన్న యింకో ఆయన-మంచంమీదినుంచి

కొదమసింగం దూకినట్లు దూకి, మా దగ్గర కొచ్చి, 'అవునవును నవాబుగారు, అంతటి ప్రజ్ఞాశాలి, అంతటి ధీమంతుడు, అంతటి సద్గుణరాసి కాబట్టే, తాను రాజ్యానికొచ్చి కొన్ని దశాబ్దాలు గతించినా, పాపం నిన్నిగాక మొన్ననే తన ప్రజల కష్ట నిష్ఠురాల్ను తెలిసికోగల్గారు! ప్రజలంతా చచ్చి చెడిచేసుకున్న విన్నపాలూ, తన నమ్మిన బంట్లయిన దేశముఖులూ, జాగీర్దార్లూ చేస్తున్న క్రూరకృత్యాలూ, రజాకార్లు రాక్షసుల్లాగ గ్రామాలమీదబడి స్వైరవిహారం చేస్తూ, బీదప్రజల్ని పెట్టిన ఘోరాతిఘోరమైన హింసలూ, యివన్నీ ఎరుగరు. కనీసం తన రాజధానిలో ప్రజలు యెలా జీవిస్తున్నదిగూడా, ఇన్నేండ్లనుంచి తెలియరాలేదు. నిజమే ఎలా తెలుస్తాయి? ప్రజల ఆర్తనాదాలన్నీ ఆ దైవభక్తుడు, ఆ అతి నిరాడంబరజీవి ప్రయాణించే "రోల్సురాయిస్" కారు ధ్వనిలో బహుశా కలిసిపోయి వుండవచ్చు...

అదిగాదు, అసలు రహస్యం యిది ప్రజాయుగం. తమ యిచ్చవచ్చినట్లు, పూర్వంలాగ యీ నిరంకుశ ప్రభువులు ఆడ్డానికి వీలు లేకుండా పోయింది. ఆసలీ కరడుగట్టిన మధ్యయుగ భూస్వామ్యత్వం, దుర్నిరీక్ష్యమై దావానంలా వ్యాపిస్తున్న ప్రజా క్రోధాగ్నిలో యెప్పుడో భస్మీపటలమైపోయి వుండేది. కాని యింకా కొద్దిగా ఆయువుండి యింకా బ్రతికుంది. ఈ నిరంకుశప్రభువు లిది గ్రహించారు. ఇహ తమతమ ఘనతల్ను, మహా ఘనతల్ను చూచి ప్రజలు మోసపోయ్యే రోజాలు అంతరించాయని తెలుసుకున్నారు. అందుకనే కిందికి దిగొస్తున్నారు. అంతే కానండీ, ప్రజల ఇబ్బందులు తెలిసి రావడంతోనే, ప్రజలపట్ల తమకున్న ప్రేమ మూసినది పొంగినట్లు పొంగి వరదలు పారడంమూలాన, ప్రజా శ్రేయస్సు దృష్ట్యా, తన సంప్రదాయాన్ని మానుకోలేదు నవాబుగారు. ప్రజలబాధ లీనాటివా? ముందెన్నడూ లేవా?' అని నా తలవైపు మంచం ఆయన కాస్సేపు జడివాన కురిపించాడు.

'మీ రేదో అంటున్నారు. మీ కసలు విషయము అంతుబట్టలా' అంటూ స్టేటుబ్యాంకి గుమస్తా గుటకలు మింగుతుంటే,

'యేమిటయ్యా అంతుబట్టేది?' అంటూ నా తలవైపు మంచం ఆయన గుమస్తా వైపు గుడురిమి చూస్తూ 'మీకే అసలు పరిస్థితులు అంతుబట్టలా. మీరు ఏ పదమూడవ శతాబ్దంలోనో ఉండవలసినవారు. లేకపోతే, బ్రిటిషు సామ్రాజ్యానికి మూల స్తంభాలైన యీ సంస్థానాధిపతులు, యీ అభివృద్ధి నిరో...' అంటూ కంఠధ్వని యినుమడింప జేసేసరికి, మంచాలన్నీ మావేపు మళ్ళినై. ఆ సవ్వడి విని, ఎవరికొంతుక లోనో మందుపోస్తున్న నర్సు పరుగెత్తుకుంటూ వచ్చి 'ఏం గోలండీ యిది. ఈయ నసలే టైఫాయిడ్ రోగి' అంటూ వారిద్దరినీ వారివారి మంచాల మీదకు పంపేసి 'మీకు జబ్బు నయంగావాలనున్నట్లు లేదు.'అని నన్ను మందలిస్తూ, కంబళిని నా మీదకు లాగి వెళ్ళిపోయింది.

---

ఒక ప్రసిద్ధ దినపత్రికకి ఓ పాఠకుడి లేఖ:

"అయ్యా! క్రిందటి లక్ష్మీవారం నా బంగారు రిస్టువాచీ పోయింది. తక్షణమే మీ పత్రికలో అది పోయినట్లు ఒక ఎడ్వర్ టైజ్ మెంటు చేశాను. ఆ రాత్రి యింటికెళ్ళి చూసుకుంటే, యింకో చొక్కా జేబులో వాచీ దొరికింది. అమోఘమైన మీ పత్రిక్కి కృతజ్ఞత."

•• •• ••

స్నేహితుడు: (అతిథితో) మీరు కష్టపడి మంచి మంచి పుస్తకాలు యిన్ని పోగుచేశారు. పసందైన బీరువా ఒకటి చేయించండి!

అతిథి: అదే చూస్తున్నాను. బీరువాకూడా ఎరువు తీసుకురావడానికి ధైర్యం లేకుండా ఉంది!